(మినీ కథ)

# ఎ ఫూల్ !



(రచయిత)

రచన : శ్రీ కె. ఓంశివ

సికింద్రాబాద్ స్టేషన్‌లో మా ఫ్రెండ్‌ను గోదావరి ఎక్కించి బయటకు వస్తున్న నాకు, 29వ నెంబర్ బస్సు కనిపించింది. పరుగులాంటి నడకతో బస్సు స్టాపువైపు పరుగు తీశాను. దారిలో అకస్మాత్తుగా ఒక పర్సు కనిపించింది. దానిని చేతిలోకి తీసుకుందామనే లోపలే, ఒక వ్యక్తి నా వైపు రావడం గమనించి దానిని నా బూట్ కాలి క్రింద నొక్కిపెట్టి వుంచాను. అలా చేయడం తప్పు అనిపించినా ప్రస్తుతం అవసరాలలో వున్న నేను అలా చేయక తప్ప లేదు. నా పరిస్థితిలో ఎవరువున్నా, అలాగే చేస్తారనిపించింది. బహుశా ఇది ఆత్మవంచనేమో? ఏమైనా పరవాలేదు. తప్పదు మరి...ఇంటి అద్దె ఇవ్వనందున మా ఇంటి యజమాని ఉగ్రరూపం నా కళ్ళముందు మెదులుతూనే వుంది. ఏవేవో పిచ్చి ఊహలు, ఆలోచనలు నన్ను చుట్టుముడుతున్నాయి.

ఇంతలో రానే వచ్చాడతను నాకు దగ్గరగా...

వస్తూనే 'సార్! నా పర్స్ ఇక్కడే ఎక్కడో జారిపోయింది. ఏమైనా చూసారా?' దీనంగా అడిగాడు.

ఏదో చెప్పాలని నా నోరు తెరుచుకుంది. గాని మళ్ళీ అవసరం నా నోరు నొక్కేసింది...

'అబ్బే, నాకేం కనిపించలేదే? మా ఫ్రెండ్ కోసం చూస్తున్నాను. వెధవ ఇంకా రాలేదు' అంటూ నా నోరు ఇంకేదో అస్పష్టంగా గొణికింది.

అతను మరింత జాలిగా ముఖంపెడుతూ అన్నాడు.

"నా పర్స్ పోయింది సార్! అందులో నాలుగువందలు దాకా వున్నాయి. ఇప్పుడింటికి వెళ్ళడానికి డబ్బులు కూడా లేవు. ఏమి చెయ్యాలో కూడా తెలియటంలేదు."

"అయితే, నన్నేమి చెయ్యమంటావు" అని అనబోయాను. కాని, అతని కళ్ళలోకి చూస్తూ ఏమీ అనలేక పోయాను. అతని కళ్ళు లోపలికి పోయాయి. మనిషి పర్సు పోయిందని బాగా కదిలిపోయినట్లు కనిపిస్తున్నాడు. బస్సు కదిలేటట్టుగా వుంది. ఏమి చేయడానికి పాలుపోవడంలేదు. పోనీ పర్సుతీసి, ఇచ్చేద్దామా అంటే? అమ్మో! ఇంకేమైనా వుందా!? అందులో ఎటూ 400 ఉన్నాయి కదా! ఈ నెల నా అవసరాలు తీర్చుకొని కాకపోతే, త్వరలోనే మనియార్డర్ చేస్తాను. డబ్బు!"

అది సరే! ఇప్పుడు యితనిని వదిలించుకోవడం ఎలా? అని ఆలోచించి చివరకు నా జేబులోవున్న పాతిక రూపాయలలో ఐదు ఉంచుకొని, ఇరవై రూపాయల కాగితం తీసి అతనికి యిచ్చాను పెద్ద దానకర్ణునిలా ఫోజ్ పెడ్తూ.

"ఈ డబ్బులతో మీరు ఏదైనా టిఫిన్‌చేసి మీ ఊరు వెళ్ళిపొండి. ఇంతకన్నా నేను ఏమీ ఇవ్వలేను" అన్నాను కాస్త గొంతులో బాధ ధ్వనించేటట్టుగా.

అతను అది తీసుకొని వెళ్ళిపోయాడు. ఇంతలో బస్సు కూడా వెళ్ళిపోయింది.

పోతేపోనీ రూ. 400 వచ్చాయిగా అనుకుంటూ నా బూటు కాలిక్రింద అంతవరకు అదిమిపెట్టిన పర్సుతీసి, ఆతృతగా తెరిచి చూస్తే అందులో 'యూ ఆర్ ఎ ఫూల్' అనే కాగితం తప్ప మరేంలేదు.